విశాలాంధ్ర విజయనగరం

పేజి నెం. 8

మంగళవారం 07, అక్టోబర్ 2025

భక్తుల రాకపోకలకు, దర్శనానికి ప్రాధాన్యత

కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: శ్రీ పైడితల్లి అమ్మవారు సిరిమాను పండగ సందర్భంగా సోమవారం జరిగిన తొలేళ్ల ఉత్సవాలు మరియు మంగళవారం సిరిమాను ఉత్సవం ప్రజలందరూ దర్శనం చేసుకోవడానికి, సులభంగా వెళ్లి రావటానికి వీలుగా బార్కేడింగ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం ఎస్పి ఏఆర్ దామోదర్ తో కలిసి కోట వద్ద నుండి అమ్మవారి గుడి వెనుక భాగాలలో, అంబటి సత్రం కూడలి వరకు పరిశీలించారు. ఏర్పాటు చేస్తున్న బారికేడ్ల ఎత్తును, వాటి పటిష్టతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులకు తగు సూచనలు జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10:30 కు సిరిమాను రథం హుకుంపేటలో బయలుదేరి అమ్మవారి గుడి చేరుకోవాలని, అక్కడ రథం ఏర్పాట్లను పూర్తిచేసి మూడు గంటలకు సిరిమాను ప్రారంభించాలని సూచించారు. ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మాట్లాడుతూ సామాన్య భక్తులందరికీ సులభ దర్శనం కలిగే విధంగా 2,600 మందితో ఏర్పాటు చేశామని, ప్రజలకు సుఖ దర్శనం కలిగేవిధంగా అన్ని చర్యలు తీసుకున్నమని, పక్కన ఉన్న పాడు పడిన భవనాలపై ప్రత్యేక దృష్టిసారించామని, ఎటువంటి అవరోధాలు లేకుండా సిరిమాను సాఫీగా తిరిగే విధంగా అన్ని చర్యలు తీసుకున్నమని వివరించారు. ఈ పర్యటనలో ఏఎస్పీలు, సౌమ్యలత, షహబాజ్ అహ్మద్, దేవదాయ శాఖ ఏసీ శిరీష, ఆర్డీవో కీర్తి తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబను దర్శించుకున్న అశోక్ గజపతి రాజు

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గజపతుల ఆడపడుచు శ్రీపైడితల్లి అమ్మవారిని, మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ గౌరవ పూసపాటి అశోక్ గజపతిరాజు సోమవారం దర్శించుకున్నారు. సంప్రదాయానుసారం అశోక్ గజపతిరాజు కుటుంబ సమేతంగా కోట నుంచి బయలుదేరి, మేళ తాళాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయాన్ని చేరుకొని పట్టు వస్త్రాలను సమర్పించారు. పైడిమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు అధికార లాంచనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అశోక్ గజపతిరాజు దంపతులకు ఆలయ పూజారులు ఆశీర్వచనం పలికి, అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు కుమార్తె, విజయనగరం శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఇతర ప్రముఖులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏడాదిలోగా ఆలయ అభివృద్ధి పనులు

ఏడాదిలోగా పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని అశోక్ గజపతిరాజు అన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే అభివృద్ధి పనులను మొదలు పెట్టామని, వచ్చే ఏడాది అమ్మవారి పండగ లోపల అవన్నీ పూర్తవుతాయని చెప్పారు.

పైడితల్లి

నేటి విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-గుర్ల : ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు 33/11 కెవి గుర్ల సబ్‌స్టేషన్ పరిధిలో వున్న 11కేవీ అచ్యుతాపురం ఫీడర్ పై గల తెట్టంగి , పోలాయవలస, గోసాడ గ్రామాలకు క్రొత్తగా లైన్ వేయుట కొరకు ఆర్డీఎస్ఎస్ పని నిమిత్తము విద్యుత్కు అంతరాయము కలుగును.విజయనగరం టౌన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. త్రినాధరావు తెలిపారు.

చలో విశాఖ మహాధర్నాకు తరలిన ఉద్యోగులు

విశాలాంధ్ర-జామి: విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కార సాధనలో భాగంగా ఎపి రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ పిలుపుమేరకు సోమవారం మండలంలోని విద్యుత్ ఉద్యోగులు చలో విశాఖ మహాధర్నాకు తరలి వెళ్ళారు. జామిలోని విద్యుత్ కార్యాలయం నుంచి ఉద్యోగులు, కార్మికులు ఐక్యతగా పయనమయ్యారు. న్యాయవరమైన సమస్యలను పరిష్కరించకుంటే నిరువధిక సమ్మె తప్పదని జెఏసి నేతలు హెచ్చరించారు.

శ్రీ పైడితల్లెమ్మ వారిని దర్శించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర -విజయనగరం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీపైడి తల్లెమ్మ వారిని పలువురు రాజకీయ ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త, మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు, సునీల గజపతిరాజు దంపతులతో పాటు వారి కుమార్తె, విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిం చారు. ఆలయ సాంప్రదాయాలతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించారు. విజయ నగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అలాగే జెడ్పీ చైర్మన్, జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిన్న శ్రీను దంపతులు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి పూజలు నిర్వహిం చారు. ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ళలలితకుమారి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్య దర్శి రాం ప్రసాద్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దంపతులు అమ్మవారికి దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పండగ అంతా పోలీసులదే ...!

- నో మోర్ ఆర్గుమెంట్ ఎవరైతే నాకేంటి..!
- మీ పాసులు చెల్లుబాటు కాదు.
- గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవహరిస్తున్న పోలీసుల తీరు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అమ్మవారి పండుగలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉంది. అమ్మవారి పండుగ ప్రధాన ఘట్టమైన తోలేళ్లు, సిరిమాను పండుగ సందర్భంగా మన రాష్ట్రంతో పాటు హైదరాబాద్,

ఒరిస్సా మిగిలిన రాష్ట్రాలతో పాటు దేశంలో ఉన్న ఎంతోమంది ఈ పండుగకు విచ్చేయడం ఆనవాయితీ. గాని గతంలో ఎప్పుడూ లేని విధంగా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత భక్తులకు ఇబ్బందిగా మారింది. ప్రతి ఏటా అమ్మవారి పండగ రోజు మాత్రమే ఏర్పాటు చేసే భారీ గేట్లు ఈ సంవత్సరం ముందుగానే ఏర్పాటు చేయడంతో కోట గంటస్తంభం మూడు లాంతర్లు తదితర ప్రాంతాల్లోకి వెళ్లే ప్రజలంతా అనేక ఇబ్బందులు పడ్డారు. పోలీసులు అంతకన్నా అత్యుత్సాహాన్ని చూపించి పిల్లలతో వెళ్లే వారిని కాకుండా మహిళలను, వృద్ధులను, వికలాంగులను సైతం లోనికి వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేయడం చాలా బాధాకరం. ఇంకా మీడియా వారిపై కూడా ఎవరైతే నాకేంటి అనేటట్టు వ్యవహరిస్తున్నారు. చిన్నపిల్లలు ఉన్నారన్న దయ కూడా లేకుండా వారిని కూడా పక్కకి తోసేయడం చాలా బాధాకరం. నిరంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటోలను, ఉచిత బస్సుల పేరుతో విపరీతంగా పెరిగిన ప్రజలను అడ్డుకట్టు వేయలేని పోలీస్ అధికారులు ఈ విధంగా ఎలా ప్రవర్తిస్తున్నారని పలువురు గుసగుసలాడు కుంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే నేటి సిరి సంబరానికి కూడా ప్రజలు బయటకు వచ్చే రాని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు కాస్త కింద స్థాయి అధికారులకి కొన్ని సలహాలు ఇస్తారని ఆశిద్దాం

రంజింపజేసిన అష్టావధానం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: ఉత్సవాలు సందర్భంగా పట్టణంలోని ఎంఆర్.లేడీస్ క్లబ్ లో రెండవరోజు(సోమవారం) సాహితీవేదికపై మహారాజ ప్రభుత్వసంస్కృత కళాశాల ప్రాచార్యులు. డా.జి.జనార్ధన నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలలో డా.రంపా అనిల్ సాయికుమార్ చే అష్టావధానం జరిగింది. అవధాన సంచాలకులు డా.జక్కురామక్రుష్ణ వ్యవహరించారు. ప్రుచ్ఛకులు కిలపర్తిదాలినాయుడు (సమస్య) సరిపల్లి సోమేశ్వరరావు నిషిద్ధాక్షరి,దత్తపది డా.శిరీషారఘురాం, మానాప్రగడ సాహితి వర్ణన,వ్యస్థాక్షరి డా.లగుడువరలక్ష్మి,ఆశువు బిహెచ్.కె.బాబూజీ, పురాణపఠనం దశగ్రంధాల వెంకట సుబ్రహ్మణ్యం, సంధించిన ప్రశ్నలకు పద్యరూపంగా,చమత్కారం గా తెలిపి సభరంజింపజేశారు.డైట్ కళాశాలప్రధానాచార్యులు రామక్రుష్ణ ప్రోత్సాహంతో ఆంధ్రోపన్యాసకకులు సత్యారావు, కె.అప్పారావు మార్గదర్శకత్వంలో డైట్ విద్యార్థినులు భువన విజయంపద్యనాటకం ప్రదర్శించారు. సాహితీసమాలోచన కార్యక్రమం సహజసేవాసంస్థ సమన్వయకర్త ఎన్.కె.బాబు ఆధ్వర్యంలోసాహిత్యంలో విభిన్న కోణాలపై విశ్లేషాత్మక చర్చలు ప్రేక్షకులకు ఆసక్తికరంగా ,ఆలోచనలు రేకెత్తించేలా చేసారు.

100 మందిపై కేసులు నమోదు : డీఎస్పీ

విశాలాంధ్ర-గుర్ల : జమ్ము గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగే దేవి నిమజ్జనంలో సందర్భంగా ఇరువర్గాల మధ్య తలెత్తిన కొట్లాట. ఇరువర్గాలను కంట్రోల్ చేసే క్రమంలో హోంగార్డుకు గాయాలు. హోంగార్డు ఫిర్యాదు మేరకు గ్రామంలో పలువురిని గుర్తించి అరెస్ట్ చేయడానికి వెళ్ళామని పత్రిక సమావేశంలో డీఎస్పీ రాఘవులు తెలిపారు. గ్రామస్తులు పోలీసులపై రాళ్లదాడి చేయడంతో పలువురు పోలీస్ అధికారులకు, కానిస్టేబుల్ కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై మరో కేసు నమోదు చేసాం. మొదట కేసులో50మందికి రెండో కేసులో సుమారు 50 మందికి కేసు నమోదు చేసి అరెస్టు చేస్తున్నామని డీఎస్పీ రాఘవులు అన్నారు. ప్రభుత్వం వ్యవస్థ మీద తిరుగుబాటు చేస్తే ఎంతటి వారినైనా విడిచి పెట్టేది లేదు అని డీఎస్పీ రాఘవులు అన్నారు వీరితోపాటు గుర్ల ఎస్సై పి. నారాయణరావు ఉన్నారు.

కనిమెట్ట పంచాయితీలో స్టాట్యుటరీ గ్రామసభ

విశాలాంధ్ర-పూసపాటిరేగ: పూసపాటిరేగ మండలం కనిమెట్ట గ్రామ పంచాయితీలో స్టాట్యుటరీ గ్రామసభ నిర్వహించబడింది. ఈ సభలో అపరిష్కృ తంగా ఉన్న వీధి దీపాలు, త్రాగునీరు, డ్రైనేజీ కాలువల నిర్వహణ వంటి ప్రజా సమస్యలపై చర్చ జరిగింది. వాటి పరిష్కారానికి సర్పంచ్ మరియు గ్రామపంచాయతీ అధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ గ్రామసభ ప్రస్తుత సంవత్సరానికి చివరిదిగా నిర్వహించబడగా, రాబోయే సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టవలసిన పనులను ముందుగానే గుర్తించి వాటిపై తీర్మానాలు ఆమోదించారు. గ్రామస్థులు కూడా తమ సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు జలపారి అప్పడుదొర (శివ), సర్పంచ్ ప్రతినిధి కూనిశెట్టి గోవింద, వైస్ సర్పంచ్ చీపురుపల్లి బోడయ్య, జనసేన నాయకులు జలపారి శ్రీనివాసరావు, ఉక్కుడు తవుడు, బోనెల నర్సింగరావు, పంచాయతీ సెక్రటరీ ప్రవల్లిక, సచివాలయ సిబ్బంది నీలిమ, రజనీ, ఫీల్డ్ అసిస్టెంట్ గురుమూర్తితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

సీడీపీఓ జాగాన విజయలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి : పోషన్ మహా కార్యక్రమంలో భాగంగా అలజంగి సచివాలయంలో సిడిపిఓ జాగాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ జాగాన మాట్లాడుతూ మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు ప్రీస్కూల్ వలన ఉపయోగాలను వివరించారు. పిల్లలను సకాలంలో అంగన్వాడీ కేంద్రాలకు కు పంపించే భాద్యత తల్లిదండ్రులు తీసుకోవాలని. సిలబస్ ప్రకారం పిల్లలకు చెపుతున్నారా లేదా. పిల్లలు ఎంత వరకు నేర్చుకుంటున్నారో తల్లులు పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ పద్మవతి. మహిళా పోలీసులు ఇద్దరు. అంగన్వాడీ టీచర్స్ నిర్మల. అరుణ. జయలక్ష్మి శకుంతల. లక్ష్మి. తల్లులు పాల్గొన్నారు.మెట్టవలస లో సెక్టార్ సూపర్ వైజర్ శుభలక్ష్మి. తారకరామకాలని సూపర్ వైజ్ర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో ఉత్సాహభరితంగా ప్రారంభమైన విజయనగరం ఉత్సవ్-2025 క్రీడా సంబరాలు

విశాలాంధ్ర- విజయనగరం ఫోర్ట్: విజయనగరం ఉత్సవ్-2025" కార్యక్రమంలో భాగంగా విజ్జి స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో క్రీడా సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం శాసనసభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి ప్రారంభించారు.జిల్లా స్థాయి ఆటగాళ్లు, విద్యార్థులు, యువత భారీగా హాజరై క్రీడా ఉత్సవానికి ప్రత్యేక చైతన్యం తీసుకువచ్చారు. వివిధ క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమా లతో స్టేడియం సందడిగా మారింది. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించుకోవాలని, క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయనగర ఉత్సవాల్లో మహారాజ సంగీత కళాశాల సాంస్కృతిక విందు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: విజయనగర ఉత్సవాల సందర్భంలో మహారాజ సంగీత కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను మంత్ర ముగ్ధులను చేశాయి. రెండోరోజైన సోమవారం జరిగిన ఈ కార్యక్రమాల్లో 36 బృందాలు పాల్గొన్నాయి. వీటిలో నాదస్వరం, గాత్రవాద్యం, వీణ, ఫ్లూట్, వయోలిన్, మృదంగం వంటి వాద్య ప్రదర్శనలతో పాటు కూచిపూడి, భారతనాట్యం నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సుమారు 300 మంది కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి చప్పట్లతో కితాబులు అందుకున్నారు. కార్యక్రమం అనంతరం వేదిక ఇంచార్జ్‌లైన శ్రీమతి కవిత, శ్రీమతి ఎస్. జానకమ్మ, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మండపాక నాగలక్ష్మి కళాకారులకు మేమెంటోలు, సర్టిఫికేట్‌లు అందజేసి, దుశ్శాలు వలతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాకా రుల ప్రతిభను అభినందించిన అధికారులు, ఇలాంటి కార్యక్రమాలు సంగీతం, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

దౌర్జన్యంగా షాపు తొలగింపు

పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర-లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్‌స్టార్ కూడలి వద్ద దౌర్జన్యంగా షాపులు తొలగించినట్లు రెల్లిగవరం పేట గ్రామానికి చెందిన పినిశెట్టి వెంకట కృష్ణమ్మ దొర తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మల్లి వీడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 36/4 లో 30 సెంట్లు గురించి గత పదేళ్లగా అదే రెల్లి గౌరంపేట గ్రామానికి చెందిన గేదెల వెంకట సూర్య రాము, గేదెల అప్పన్న దొర మధ్య కోర్టులో భూ సమస్య ఉందని సోమవారం ఉదయాన్న చిరు వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్న ఆరుగురు షాపులను అక్రమంగా ఇతర ప్రాంతాల నుంచి రౌడీ మూకలను తీసుకువచ్చి జెసిబి యంత్రాలతో అక్రమంగా తొలగించారని వెంటనే విషయం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకుని ప్రశ్నించేసరికి అదే గ్రామానికి చెందిన 11మంది వ్యక్తులు, గుర్తుతెలియని మరి కొంతమంది జీవీఎస్ రాము ప్రోత్సాహంతో తనపై దాడి చేసి కొట్టారని పోలీసు వారికి ఫిర్యాదు చేశానని తెలిపారు. ఒక్కసారిగా చిరు వ్యాపారస్తులు కుటుంబాలు రోడ్డునపడి లబోదిబోమని బోరున విలపిస్తున్నాయి. విశాఖ-అరకు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ షాపులు కూల్చివేయడంతో ప్రయాణికులు ఒక్కసారిగా జరిగిన సంఘటన చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నవీన్ పడాల్ తెలిపారు.

నందిగం పంచాయతీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

విశాలాంధ్ర-భోగాపురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతీ ఏటా ప్రకటించే "స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు-2025" విజేతలను ప్రకటించింది. మండలంలో నందిగాం గ్రామ పంచాయతీ స్వచ్ఛ ఆంధ్ర అవార్డు 2025 కు ఎంపికైంది. ఈ అవార్డు ను నందిగాం పంచాయతీ సర్పంచ్ గొరే మురళి మోహన్ రాష్ట్ర హోమ్ మంత్రి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మార్క్ ఫెడ్ చైర్మన్ బంగార్రాజు చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. ఈ అవార్డు లు గ్రామస్థాయిలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర సర్వే లో భాగంగా పరిశీలించిన ఫలితాల ఆధారంగా ఎంపిక చేయబడ్డాయి. పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ప్రజా ప్రదేశాల సంరక్షణ వంటి అంశాలలో విశేష కృషి చేసిన గ్రామ పంచాయతీలకు ఈ అవార్డులు లభించాయి ఆగస్టు 20 నుండి సెప్టెంబర్ 30వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వే అనంతరం జిల్లా స్థాయి కమిటీలు చేసిన సమీక్షల ఆధారంగా జిల్లా స్థాయిలో 5 గ్రామాలు ఉత్తమ గ్రామాలుగా గుర్తించబడ్డాయి.

బొత్స గారూ! నాచరిత్ర గురించి మీ అల్లుడ్ని అడగండి!

- బొత్సపై డిసిసిబి చైర్మన్ కిమిడి ఘాటు వాఖ్యలు
- నా కుటుంబం గురించి రెండు జిల్లాల ప్రజలకు పూర్తిగా తెలుసు

విశాలాంధ్ర-విజయనగరం : 'బొత్స సత్యనారాయణ గారూ.. మీ హుందాతనం మరిచిపోయి మాట్లాడుతున్నారు. మీ పెద్దరికం హద్దులు దాటి వాఖ్యానిస్తున్నారు. నాగార్జున చరిత్ర గురించి పర్మిషన్ ఇస్తే చెబుతామని మీరు అనడం విడ్డూరంగా ఉంది. అయినా నేను పర్మిషన్ ఇస్తున్నాను. నాచరిత్రను ప్రజల వద్దకు పూర్తిగా తెలియజేయండి..' ఇవి విజయనగరం డిసిసిబి చైర్మన్ టీడీపీ నేత కిమిడి నాగార్జున చేసిన వాఖ్యలు.. వివరాల్లోకి వెళితే..

ఈ ఏడాది శ్రీపైడితల్లి అమ్మవారి సిరిమాను జాతరను వీక్షించేందుకు డిసిసిబి కార్యాలయం నుంచి ప్రతీ ఏటా బొత్స అండ్‌కో అంతా కలిసి ఏర్పాట్లు చేసుకునే వారు. ఈ ఏడాది కూటమి చేతిలోకి డిసిసిబి వెళ్ళిపోవడంతో ఈఏడాది బొత్సకు అవకాశం ఇవ్వలేమని చైర్మన్ కిమిడి తేల్చి చెప్పారు. అంతేకాకుండా డిసిసిబి పరిదిలోని 94 పిఏసిఎస్ అధ్యక్షులను జాతరకు రావాలని ఆహ్వానాలను పంపించి, వారికి డిసిసిబి కార్యాలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే జరుగుతోంది. కానీ ఈవిషయం రాజకీయ దుమారం రేపుతోంది. ఇప్పటికే నాగార్జున, జెడ్పీ చైర్మన్ చిన్నశ్రీనులు ప్రెస్‌మీట్‌లు పెట్టిమరీ రచ్చ చేసారు. ఇది చాలదన్నట్లు బొత్స నేరుగా ప్రెస్‌మీట్ పెట్టి అందులో నాగార్జున చరిత్రను ఆయన అనుమతిస్తే చెబుతానని వాఖ్యానించడం సంచలనంగా మారింది. దీనిపై కిమిడి నాగార్జున ధీటుగా స్పందించారు. తమ కుటుంబం రాజకీయంగా రెండు జిల్లాలకు తెలిసిన కుటుంబమన్నారు. తన తల్లిదండ్రుల చరిత్ర అందరికీ తెలుసన్నారు. తన వ్యక్తిగతంగా చెప్పాలంటే ముందుగా బొత్సగారూ.. మీ అల్లుడుతోనూ. చిన్న శ్రీనుతోనూ మాట్లాడి విషయాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. మీఅల్లుడుతో సమకాలీకులుగా ఉన్నామని, తాను 2008నుంచి 15 వరకు అమెరికాలో సిస్కో కంపెనీలో ఉద్యోగం చేసానని తెలిపారు. అన్నీ తెలుసుకుని మీరు మాట్లాడేందుకు తాను అనుమతి ఇస్తున్నానని, నాచరిత్రను తెలియజేయాలని సూచించారు.

బొత్సకు అర్బన్ బ్యాంకు స్థలం కేటాయింపు..!

శాసనమండలి ప్రతిపక్షనేతగా ఉన్న బొత్స సత్యనారాయణకు సిరిమాను తిరిగే ప్రాంతంలోని అర్బన్ బ్యాంకు స్థలాన్ని కేటాయించినట్లుగా తెలిసింది. ఇక్కడనుంచి వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవిషయం ప్రస్తుతం జిల్లాలో హాట్ టాపిక్ మారడంతో ఎక్కడ చూసినా ఈచర్చలే కనిపిస్తున్నాయి. ఎట్టకేలకు కిమిడి నాగార్జున తనపట్టు విడవకుండా డిసిసిబి మెట్లు బొత్స అండ్‌కో ఎక్కకుండా ప్రయత్నించి సఫలమయ్యారని ప్రజలు వాఖ్యానిస్తున్నారు. ఈవిషయం ఇంతటితో ఆగిపోలేదని పలు వివాదాలకు దారితీస్తుందని నేతలు చెప్పుకుంటున్నారు.

శ్రీపైడితల్లి అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజానీకంపై ఉండాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్న

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విజయనగరం శ్రీపైడితల్లి అమ్మవారిని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం దర్శించుకున్నారు.పూర్ణకుంభం, ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికిన దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం దేవస్థానం ఈవో అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండి సుఖ సంతోషాలతో జీవించాలని,అమ్మవారిదయతో ఆంధ్ర రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు. శ్రీపైడితల్లి ఆశీస్సులుతో రాష్ట్రం అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన పథకాలు, ప్రాజెక్టులు సత్ఫలితాలను ఇవ్వాలని దివ్యమైన, భవ్యమైన రాజధానిగా అమరావతి నిర్మాణం పూర్తి కావాలని ఆకాంక్షించారు.

దబ్బిరాజుపేట పాఠశాల సందర్శనలో ఎంఈఓ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని దబ్బరాజు పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి పి.బాల భాస్కరరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాటశాల పరిసరాలు తరగతి గదులు పరిశీలించిన అనంతరం విద్యార్దులుతో తెలుగు అభినయ గేయాలు పాడించగా విద్యార్థులు చక్కగా పాడారు. ఇంగ్లీషు, చదివించడం రాయించడం, చతుర్విద ప్రక్రియలు చేయించగా చక్కగా చదువుతున్నారు. విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల చివరికి మొదటి సెమిస్టర్ పూర్తి చేయాలని సూచించారు. ఎండిఎం ఏజెన్సీని కలసి తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పురిటి పెంటలో బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-గజపతినగరం: మండలం లోని పురిటి పెంట గ్రామంలో బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విచ్చేసి ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పున నిర్మాణం నూతన విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన, ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, వి.వి. ప్రదీప్ కుమార్, గొర్లె బంగారనాయుడు, లంక బంగారు నాయుడు, పొట్నూరు అప్పల రామ్, శనపతి గణేష్, నాగ శివ బాబు, వైసిపి నాయకులు కరణం ఆదినారాయణ, మండల సురేష్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాత బగ్గాంలో పోషణ పక్వాడ కార్యక్రమం

విశాలాంధ్ర-గజపతినగరం: మండలం లోని పాతబగ్గంలో సోమవారం ఐసిడిఎస్ సిడిపిఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అంగన్వాడి సెంటర్ మరియు హబ్ సెంటర్లో నిర్వహించి గర్భిణీలు బాలింతలకు తగు సూచనలు సలహాలు అందజేశారు. ఈసీసీఈ ఇంపార్టెంట్ గూర్చి ఎడబ్ల్యుసి విద్యుత్ గూర్చి పిల్లల శారీరక మానసిక అభివృద్ధి కోసం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ శకుంతల, అంగన్వాడి టీచర్లు ఎస్ కనకదుర్గ, శారద, ఆయాలు, కోఆర్డినేటర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అప్సా ఏకడమిక్ అవార్డును అందుకున్న వివేక్ మాస్టర్ మైండ్స్ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు.

విశాలాంధ్ర-వంగర : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వంగర వివేక్ మాస్టర్ మైండ్స్ కాలేజీ ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు ను ఏ.పి రాష్ట్ర అప్సా అకడమిక్ అచీవర్ అవార్డ్ ఎంపికై అందుకొన్నారు. ఆదివారం నాడు విజయవాడలో అప్సా రాష్ట్ర చైర్మెన్ సుబ్రమణ్యం,రాష్ట్ర కౌన్సిల్ ఛైర్మెన్ కె. చంద్రశేఖర్,జనరల్ సెక్రటరీటి. సింహాచలం,రాష్ట్ర కమిటీ సభ్యులు సీతారామ వంక్షన్ హాల్లో ఆయన్ని ఘనంగా సత్కరించారు.వంగర మాస్టర్ మైండ్స్ ప్రిన్సిపాల్ ఈశ్వర రావు గత 15 సంవత్సరాలుగా విద్యారంగంలో విశేష సేవలందించి అత్యుత్తమ ఫలితాలు సాధించిన వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్ సేవలను గుర్తించి ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు ను ఏ.పి రాష్ట్ర అప్సా అకడమిక్ అచీవర్ అవార్డ్ ను (అప్సా ఐకాన్ అవార్డ్) అందించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అప్సా ప్రెసిడెంట్, కాన్సిల్ చైర్మన్ ,జనరల్ సెక్రటరీ, రాష్ట్ర బాడీ సభ్యుల తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఈశ్వరరావు వివరించారు.

ఉపాధి శ్రామికులు తప్పనిసరిగా ఈకేవైసి చేయించుకోవాలి : ఎపివో హరినాథ్

విశాలాంధ్ర-రేగిడి: ఉపాధి శ్రామికులు తప్పనిసరిగా ఈకేవైసి చేయించుకోవాలని ఎపివో సంకాబత్తుల హరినాథ్ అన్నారు .మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో భాగంగా సోమవారం రేగిడి మండలంలోని తునివాడ గ్రామపంచాయతీ లో ఉపాధి శ్రామికుల ఈకేవైసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలోని ఉపాధి శ్రామికులు ఆధార్ కార్డు, జాబ్ కార్డు ఆధారంగా ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ కేవైసీ ప్రక్రియను చేస్తున్నారని తెలిపారు.మండలంలో మొత్తం 27,080 మంది ఉపాధి శ్రామికులు ఉండగా, ఇప్పటివరకు 9,872 మంది మాత్రమే ఈ కేవైసీ పూర్తి చేసుకున్నారని ఆయన వివరించారు. మిగిలిన శ్రామికులు కూడా త్వరితగతిన ఈకేవైసి పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

రాజాం మున్సిపాలిటీకి కొత్త కమిషనర్ బాధ్యతలు

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సిపాలిటీ (ఫుల్ ఎడిషనల్ చార్జెస్) కమిషనర్‌గా కొంచాడ శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, పౌర సౌకర్యాల మెరుగుదల కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సహకారంతో అన్ని విభాగాల్లో సమన్వయంతో పని చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలో పరిశుభ్రత, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, పన్నుల వసూళ్ల పెంపు వంటి అంశాలపై ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతానని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ భోగాపురంలో

విశాలాంధ్ర-భోగాపురం : స్థానిక పంచాయతీ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమా న్ని ఘనంగా నిర్వహించారు. ఈ సర్పంచ్ అప్పయ్యమ్మ అధ్యక్షతన కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన తాజా జీఎస్టీ తగ్గింపులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మానవహారం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు,ప్రసంగిస్తూ పేద మరియు మధ్యతరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చింది. ఎన్డీఏ ప్రభుత్వం వినియోగదారులపై భారం తగ్గిస్తూ, గృహోపయోగ వస్తువులపై జీఎస్టీని 28% నుంచి 18%కి తగ్గించడం ద్వారా ప్రతి కుటుంబానికి సగటున రూ.15,000 వరకు ఆదా అవుతోంది. టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, డీష్ వాషర్లు వంటి 375 వస్తువులు ఇకపై మరింత సరసమైన ధరల్లో లభించనున్నాయి అని తెలిపారు. జీఎస్టీ తగ్గింపు వల్ల జీవన ప్రమాణం మెరుగవడమే కాకుండా, దేశీయ తయారీ పరిశ్రమకు కొత్త ఉత్సాహం, వినియోగదారుల డిమాండ్‌లో వృద్ధి ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కొమ్మూరు సుభూషణరావు, ఆళ్ల ఉదయబాబు, ఆళ్ల విశ్వేశ్వరరావు , జనసేన నాయకులు బొల్లు త్రినాథ్, మాత నవీన్, పడాల శ్రీనివాసరావు, ఈఓ జయమ్మ, పంచాయతీ, వ్యవసాయ శాఖ, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కె.ఆర్.పేటలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం

పాడి రైతులకు అవగాహన

పశువైద్యాధికారిణి డాక్టర్ కే. గాయత్రి

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని కృష్ణరాయుడు పేట గ్రామంలో సోమవారం ఉచిత పశు ఆరోగ్య మరియు గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించడం జరిగిందని పశువద్యాధికారిణి డాక్టర్ కోరాడ గాయత్రి అన్నారు. ఈ శిబిరంలో మొత్తం 59 మంది పాడి రైతులకు చెందిన 25 పశువులకు వివిధ రకాల వైద్య సేవలు అందించారు.పశువులపై 10 కృత్రిమ ధారణ ఇంజెక్షన్లు, 35 గర్భకోశ మరియు సాధారణ వ్యాధులకు చికిత్సలు చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అదనంగా 100 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.శిబిరం సందర్భంగా రైతులకు పశువులు ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పుట్టిన దూడలకు ముర్రు పాలు ఇచ్చే ప్రాముఖ్యత,వర్షాకాలంలో పశువుల సంరక్షణ,పశుగ్రాసం పెంపకం వలన కలిగే లాభాలపై అవగాహన కల్పించారు.అలాగేగ్రామ సర్పంచ్ చెలిబోని ముసలి నాయుడు (బాలబాబు) శిబిరాన్ని సందర్శించి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో వేపాడ పశువైద్య సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు. ..

సూపర్ జి. ఎస్.టి కార్యక్రమాలు

షెడ్యూల్ ప్రకారంగా జరగాలి

- పారిశుధ్యం పై దృష్టి పెట్టాలి

- అలసత్వాన్ని సహించేది లేదు- టిసిలో స్పష్టం చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం: సూపర్ జి ఎస్ టి క్యాంపెన్ లో షెడ్యూల్ లో ఇచ్చిన లక్ష్యాల మేరకు ఏ రోజు కార్యక్రమాలను ఆ రోజే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి ఆదేశించారు. గ్రామ స్థాయి నుండి. జిల్లా స్థాయి వరకు. ఛాంపియన్స్ గా ఉన్న సచివాలయ సెక్రటరీ లు, ఎం.పి.డి.ఓ లు, మున్సిపల్ కమిషనర్లు కార్యక్రమాలను డాక్యుమెంటేషన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. సోమవారం కలెక్టర్ సూపర్ జి ఎస్ టి కాంపెయిన్ , ఎరువుల సరఫరా, పారిశుధ్యం పై ఎం పి డి ఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో టెలికాన్ఫెరెన్సు. నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సూపర్ జి ఎస్ టి పై పరిశ్రమల శాఖ ద్వారా ఎం.ఎస్.ఎం.ఈ లలో ఎక్సిబిషన్లు నిర్వహించాలని తెలిపారు. అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో సూపర్ జి ఎస్ టి పై అవగాహనా తరగతులను నిర్వహించి, విద్యార్థులకు పోటీలను కూడా నిర్వహించాలని తెలిపారు. వైద్య శాఖ ద్వారా మందుల పై సూపర్ జి ఎస్ టి ప్రభావాన్ని అవగాహన కలిగించాలన్నారు. వ్యవసాయ పరికరాలు, ఎరువుల పై రైతు సేవా కేంద్రాల్లో అవగాహన, ర్యాలీ లను కల్పించాలన్నారు. అన్ని కార్యక్రమాలను గ్రామ స్థాయి లో సెక్రటరీ లు అప్లోడ్ చేయాలన్నారు. లక్ష్యాలను చేరుకోవాలని, లేని యెడల సహించేది లేదని స్పష్టం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం పై దృష్టి పెట్టాలని, పండగ రోజులు కొనసాగుతున్న దృష్ట్యా రక్షిత తాగునీటిని సరఫరా చేయాలని, కలుషిత నీరు, ఆహారం తీసుకోవద్దని ప్రజలకు అవగాహన కలిగించా లన్నారు. గ్రామాల్లో ప్రతి రోజూ పారిశుధ్యం చేపట్టాలన్నారు. ఎక్కడైనా కేసు లు నమోదైతే చర్యలు తప్పవన్నారు. యూరియా సరఫరాలో మండల స్థాయి కమిటీ లు సమన్వయంగా పని చేయాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం కావాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రతిరోజు ఈ క్రాప్ బుకింగ్ వివరాలను తెలియజేయాలన్నారు.

శ్రీరాముల ఆలయానికి స్థలదానం

ఆధ్యాత్మికతకు మానవీయతకు నిదర్శనం

అభినందిస్తున్న సోంపురం గ్రామస్తులు

విశాలాంధ్ర-వేపాడ: ప్రస్తుతం సమాజంలో భూమి కోసం పోరాడుతున్న ఈ కాలంలో, భూమి విలువలు ఆకాశాన్ని తాకుతున్న ఈ రోజుల్లో, మనను విలువను గుర్తుచేసిన ఓ దాతృత్వ ఘట్టం సోంపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కీర్తిశేషులు తల్లావఝుల విజయ గోపాలం వారి కుమారుడు కీర్తిశేషులు తల్లావఝుల రామజోగి నరసింహులు వారసులు తల్లావఝుల వరోహ నరసింహమూర్తి, రాధాకృష్ణ, పురుషోత్తము,విజయగోపాలములు తమ సొంత 10 సెంట్లకు పైగా విలువైన స్థలాన్ని గ్రామంలోని శ్రీరాములవారి ఆలయం పేరిట భక్తిశ్రద్ధలతో దానం చేశారు.ఎన్నో ఏళ్లుగా అదే స్థలంలో శ్రీరామనవమి వేడుకలు, అన్న సమారాధన కార్యక్రమాలు జరుగుతుండగా, ఇప్పుడు ఆ పవిత్ర భూమిని శ్రీరాములు వారి మందిరం పేరిట రాతపూర్వకంగా ఆలయానికి సమర్పించడం పట్ల గ్రామం అంతా ఆనందోత్సాహాలతో మునిగిపోయింది. గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ ఆకుల సత్యనారాయణ, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్థుల సమక్షంలో ఈ దాతృత్వ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు మాట్లాడుతూ"ఇంత విలువైన భూమిని దేవాలయానికి అంకితం చేయడం ఈ కుటుంబం యొక్క మానవీయతకు, ఆధ్యాత్మికతకు ప్రతీక,"అని ప్రశంసించారు. అలాగే ఎంపీటీసీ ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ"ఈ దాతృత్వం గ్రామానికి శాశ్వత గౌరవం తెచ్చిందని. తల్లావఝుల కుటుంబయుకుల రుణం తీరనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉగ్గిన శ్రీనివాసరావు, కోటంశెట్టి గణపతి తదితరులు పాల్గొని సమాజంలో భౌతిక విలువలు పెరిగినా, ఆధ్యాత్మిక విలువలు క్షీణించకూడదని ఈ దాతృత్వం మరొక్కసారి నిరూపించింది. భూమిని ఇచ్చి భక్తిని నిలబెట్టిన తల్లావఝుల కుటుంబం నిజమైన సేవాదర్శం.అని కొనియాడారు.

రాజా కళాశాలలో అంతరిక్ష వారోత్సవములు

విశాలాంధ్ర-బొబ్బిలి : స్థానిక రాజా ఆర్ యస్ ఆర్ కె రంగారావు కళాశాల మరియు శ్రీహరికోట సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ వారు సంయుక్తంగావరల్డ్ స్పేస్ వీక్ - 2025 ను ఈ నెల 8 వ తేదీ నుండి 10 వ తేదీ వరకు రాజా కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సి హెచ్ వీరేంద్ర కుమార్ విలేకరులకు తెలిపారు.వరల్డ్ స్పేస్ వీక్ అనేది విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతికతల ఉత్సవం. మానవ జీవితాన్ని మెరుగు పరచడంలో వాటి పాత్రను గుర్తించడానికి ఈ కార్యక్రమం జరుపుకుంటారు. 1999లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ప్రతి సంవత్సరం అక్టోబర్ 4 నుండి 10 వరకు వరల్డ్ స్పేస్ వీక్ నిర్వహించాలని ప్రకటించింది. 1957 అక్టోబర్ 4న తొలి ఉపగ్రహం స్పుట్నిక్%-%1 ప్రయోగం మరియు 1967 అక్టోబర్ 10న అవుటర్ స్పేస్ ఒప్పందం" గుర్తింపుగా ఈ తేదీలు నిర్ణయించబడ్డాయి. 2025 సంవత్సరానికి వరల్డ్ స్పేస్ వీక్ థీమ్ లివింగ్ ఇన్ స్పేస్. ఈ థీమ్ అంతరిక్షంలో మనిషి శాశ్వత నివాసం ఏర్పరచుకోవడంలో అవసరమైన సాంకేతికతలు, ఆవిష్కరణలు మరియు సవాళ్లను ప్రతిపాదిస్తుంది. అంతరిక్షం తీవ్రమైన ఉష్ణోగ్రతలు, శూన్యత, మరియు జీవన మద్దతు వ్యవస్థల అవసరం ఉన్న ప్రమాదకర వాతావరణం. అంతరిక్షంలో నివసించడం అంటే స్వయం సమృద్ధిగా, సాంకేతికంగా అభివృద్ధి చెందిన వసతులను ఇతర గ్రహాలపై ఏర్పాటు చేయడం. అయితే, బరువులేమి , రేడియేషన్, రవాణా ఖర్చు, మానసిక ఒత్తిడి వంటి సవాళ్లు ఎదురవుతాయి. వీటిని కృత్రిమ గిరాకి ఆధునిక జీవన మద్దతు వ్యవస్థలు, రేడియేషన్ రక్షణ, స్థానిక వనరులతో నిర్మాణం వంటి పద్ధతులతో తగ్గించవచ్చు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ ౨ భారత అంతరిక్ష కేంద్రం ౨ ప్రతి సంవత్సరం ఇస్రో ఆధ్వర్యంలో వరల్డ్ స్పేస్ వీక్‌ను ప్రజా అవగాహన కార్యక్రమాల రూపంలో నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం ఎస్ డి ఎస్ సి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లోని ఆరు ఎంపిక చేసిన కేంద్రాలలో ఈ ఉత్సవాలను జరుపుతోందని తెలిపారు. బొబ్బిలి, విజయనగరం, పార్వతీపురం ప్రాంతాల విద్యార్థులు, ప్రజలకు అంతరిక్ష సాంకేతికతల ప్రయోజనాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం అక్టోబర్ 8న రాజా ఆర్ఎస్ఆర్కే రంగారావు కాలేజీలో ప్రారంభమవుతాయి. మూడు రోజులపాటు వివిధ కార్యక్రమాలు జరుగుతాయి ౨ క్విజ్, డ్రాయింగ్, సైన్స్ ఫెయిర్, పోస్టర్ ప్రెజెంటేషన్లు, వాక్ ఫర్ స్పేస్ వీక్, సీనియర్ శాస్త్రవేత్తలతో చర్చలు, స్పేస్ ఆన్ వీల్స్, వీడియో ప్రదర్శనలు వంటివి.మరియు రాజా ఆర్ఎస్ఆర్కే కాలేజ్ మేనేజ్‌మెంట్ ఈ కార్యక్రమం విజయ వంతంగా జరిగేలా కృషి చేస్తున్నాయి. ప్రారం భోత్సవం మరియు ముగింపు కార్యక్రమాలకు ఇస్రో చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు, అధికారులు హాజరవుతారు. పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. ప్రజలందరూ, విద్యార్థులందరూ ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రాజకీయ కక్షల బారిన అరిగిపాలెం పంచాయతీ భవనం

నిర్మాణం పూర్తయిన ప్రారంభానికి నోచుకోని వైనం

అంగన్వాడీ కేంద్రంలో కార్యదర్శి విధులు నిర్వహణ

ఆక్షేపిస్తున్న అరిగి పాలెం గ్రామస్తులు

విశాలాంధ్ర-వేపాడ: ప్రజల సౌకర్యార్థం నిర్మించిన అరిగిపాలెం పంచాయతీ భవనం నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా రాజకీయ కక్షల బారిన పడి ప్రారంభానికి నోచుకోకపోవడంతో తాళాలు వేసి పాడైపోతున్నది.ప్రభుత్వం లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి పూర్తి చేసిన భవనం ఏళ్ల తరబడి ప్రారంభం కాని స్థితిలో ఉండటంపై గ్రామ పంచాయతీ పాలకల్లో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.16 లక్షల నిధులతో ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనం ప్రారంభించకుండా ఉండడం వలన చుట్టూ చెత్త పేరుకుపోయి,గోడల పాడైపోయే దుస్థితిలో ఉంది. దీంతో పంచాయతీ భవనంలో విధులు నిర్వహించాల్సిన పంచాయతీ కార్యదర్శి అంగన్వాడీ కేంద్రంలో విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాయకుల మధ్య విభేదాలు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజల హక్కుగా ఉన్న పంచాయతీ భవనం వాడుకలోకి రాకపోవడంపై గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. "రాజకీయ పార్టీలు ఎవరిదైన, భవనం ప్రజలదే. ఇలాంటి ప్రజా అవసరాల నిమిత్తం నిర్మించిన పంచాయతీ భవనాలను కక్ష సాధనంగా వాడటం సిగ్గుచేటు"అని గ్రామస్తులు మండిపడుతున్నారు.ఇదే విషయమై మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు గ్రామ సర్పంచ్ దుల్ల లక్ష్మీ సన్యాసిరావు,ఎంపీటీసీ తొండవరపు వెంకటరమణలు పంచాయతీ భవనం ప్రారంభం విషయమై లేవనెత్తి పంచాయతీ భవనం పూర్తయిందని బిల్లులు కూడా చెల్లించేసారని అయినా పంచాయతీ భవనం ఎందుకు ప్రారంభించలేదని దీనివలన గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని నిలదీసిన సంఘ టనలు లేకపోలేదు. సర్వసభ్య సమావేశం లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రారంభిం చేస్తామని చెప్పడమే తప్ప అధికారులు చొరవ తీసికొని ప్రారంభించక పోవడం దారుణం అంటూ గ్రామ సర్పంచ్ ఎంపీటీసీ లుగా మేము ప్రజాప్రతినిధులము కాదా మమ్మల్ని కించపరచడమే అని అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ పంచాయతీ భవనం గత టిడిపి హయాంలో మంజూరై ప్రతిపక్ష వైసిపికి ప్రభుత్వంలో పూర్తి చేసుకోవడమే దీనికి చేసిన పాపం అంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులతో పాటు మండల అధికారులు వెంటనే జోక్యం చేసుకొని భవనాన్ని ప్రారంభించి ప్రజా వినియోగానికి అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

జీవితం అంటే సంపూర్ణమైన ఆరోగ్యం

హోంమంత్రి వంగలపూడి అనిత

అవగాహన ద్వారానే స్వచ్ఛాంధ్ర సాధ్యం

ఎంఎస్ఎంఈ శాఖామంత్రి కొండపల్లి

స్వచ్ఛాంధ్ర-2025 అవార్డుల పంపిణీ

విశాలాంధ్ర-విజయనగరం: జీవితం అంటే సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, హోం శాఖామంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. చిన్నతనం నుంచే పిల్లలకు పరిసరాల పరిశుభ్రతను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం జరిగిన స్వచ్ఛాంధ్ర-2025 జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొత్తం48 మంది వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ప్రజలు ఆరోగ్యంగా ఉండటంలో పారిశుధ్య కార్మికులు పాత్ర చాలా కీలకమని అన్నారు. పారిశుధ్య కార్మికులు వారి ఆరోగ్యాన్ని పక్కనపెట్టి,సేవలందిస్తున్నారని అన్నారు. పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అవార్డులను ప్రవేశపెట్టారని చెప్పారు. రాష్ట్రంలో పేరుకుపోయిన సుమారు 89 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించి, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు కృషి చేశారని చెప్పారు. ప్రభుత్వం స్వఛ్ఛాంధ్ర పేరుతో అనేక కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో చెత్తనుండి కూడా సంపద సృష్టి జరుగుతోందని చెప్పారు. చెత్తరహిత పరిసరాల పరిశుభ్రతకోసం రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆరోగ్య ఆంధ్రప్రదేశే ఎన్డియే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పరిశరాల పరిశుభ్రత ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. ఖచ్చితమైన లక్ష్యంతో ముందడుగు వేయాలని, అంకితభావంతో కృషి చేయాలని కోరారు. ప్రతీనెలా మూడవ శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల్లో అవగాహన పెంచడం వల్లే స్వచ్ఛభారత్ సాధించవచ్చునని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమని అన్నారు. ప్రతీఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కలిసికట్టుగా కృషి చేయడం వల్లే స్వచ్ఛత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. స్వచ్ఛత సాధనలో ప్రతీఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. స్వచ్ఛాంధ్ర సాధనకు చేస్తున్న కృషిని, కార్యాచరణ ప్రణాళికను వివరించారు. 15 విభాగాల్లో 48 మంది అవార్డులు గెలుచుకున్నారని చెప్పారు. అదేవిధంగా రెండు రాష్ట్రస్థాయి అవార్డులు కూడా జిల్లాకు లభించాయని తెలిపారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎంఎల్‌సి కావలి గ్రీష్మ మాట్లాడారు. కార్యక్రమంలో రాజాం, నెల్లిమర్ల మున్సిపల్ ఛైర్మన్లు, విజయనగరం మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందజేశాం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్న

విశాలాంధ్ర-రామభద్రపురం: రాష్ట్రంలో రైతులందరికీ కూడా యూరియా రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం మధ్యాహ్నము మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ 6 పేరుతో ఇచ్చిన హామీలన్నీకేవలం 15నెలల లోనేఅమలు చేయడం జరిగింది అని అన్నారు. యూ రి య కొరత అనేది కేవలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సృష్టించిందేనని అన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క రైతు కూడా ఎరువులు ఇబ్బందులు లేకుండా ఈ ఏడాది ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈయన వెంట స్థానిక రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, రామభద్రపురం సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, మండల తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చింతల చిన్నమ్మ తల్లి మాస్టర్ తదితరులు ఉన్నారు.

గుబాళించిన సాహిత్య సౌరభం - గురుప్రసాద్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సకల కళలకు సమాహారంగా నిలిచిన విజయనగరంలో సాహిత్య సౌరభం గుబాళించింది. విజయనగరం ఉత్సవాలలో భాగంగా జరిగిన కవి సమ్మేళనం ఆద్యంతం అలరించింది. సుమారు 120 మంది కవులు తమ కవితలను పఠించారు. కవిసమ్మేళనంలో జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ తనదైన శైలిలో దేవులపల్లి కృష్ణశాస్త్రిపై కవితా పఠనం గావించారు. ఈ కార్యక్రమంలో గురుప్రసాద్‌ను మహారాజా సంస్కృత కళాశాల ప్రాచార్యులు డాక్టర్ జి జనార్ధన్ నాయుడు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, జిల్లా సహకార సంస్థ అధికారి రమేష్‌కుమార్, స్కిల్ డెవలప్ మెంట్ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్, డాక్టర్ జక్కు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలపై పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలి

మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లా ప్రజలపై పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కోరుకున్నారు. సోమవారం నాడు మూడు లాంతల వద్ద ఉన్న శ్రీ పైడితల్లి అమ్మవారినీ సకుటుంబ సపరివార సమేతంగా దర్శించుకొని, సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. శ్రీ పైడిమాంబ ఆశీస్సులు విజయనగర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కోలగట్ల కుటుంబ సభ్యులతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నగర కార్పొరేటర్లు, వివిధ హెూదాల్లో ఉన్నటువంటి నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం

(విశాలాంధ్ర-విజయనగరం)

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత, విజయనగరం పట్టణ వాసుల ఇంటి దేవతగా ప్రఖ్యాతిగాంచిన శ్రీపైడితల్లెమ్మ అమ్మవారి జాతరలో భాగంగా సోమవారం తొలేళ్ళ ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ఆలయ వేదపండితుల ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే ఆలయాన్ని అలంకరణతో అత్యంత సుందరంగా తయారు చేసారు. అమ్మవారికి ఆలయ అనువంశిక ధర్మకర్త పి.అశోక్ గజపతిరాజు దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు.

ఏర్పాట్లుపై అధికారుల నిరంతరన పర్యవేక్షణ

ఉత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ,ఎస్‌పి ఎఆర్ దామోదర్‌లతోపాటు ఆర్‌డివో కీర్తి తదితరులు నిరంతర పర్యవేక్షణ చేసారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చేయాలని సిబ్బందికి సూచించారు.